## ఎస్సీఆర్‌లో 'ప్రత్యేక' దోపిడీ

- రెగ్యులర్ రైళ్ల స్థానంలో ప్రత్యేక రైళ్ల ఏర్పాటు
- సాధారణ చార్జీపై 30-50 శాతం వరకు వసూలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : లాభాలే లక్ష్యంగా ప్రత్యేక రైళ్ల పేరుతో దక్షిణ మధ్య రైల్వే దోపిడీకి పాల్పడుతూ ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నది. కొన్ని ప్రధాన మార్గాల్లో సాధారణ రైళ్లనే నడిపిస్తున్నప్పటికీ, అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉన్నారంటూ ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేస్తున్నది. సాధారణ రైళ్ల సీట్ల రిజర్వేషన్ విషయంలో కృత్రిమ కొరత సృష్టించి, ప్రత్యేక రైళ్లలో ప్రయాణించేలా చేస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో తప్పని పరిస్థితిలో ప్రయాణికులు ప్రత్యేక రైళ్లలోనే ప్రయాణించాల్సి వస్తుంది. అయితే, రెగ్యులర్ చార్జీలనే భరించలేని ప్రయాణికుల నుంచి ప్రత్యేక రైళ్ల పేరుతో సాధారణ చార్జీలపై 30నుంచి 50శాతం వరకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు రెగ్యులర్ చార్జీ రూ.100 ఉంటే, అదనంగా రూ.50 కలిపి మొత్తం రూ.150 వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా రిజర్వేషన్ టికెట్ల ద్వారా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులపై టికెట్ కొనుగోళ్లతో అధికభారం పడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మరో ఏడు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ జార్ఖండ్, దక్షిణ హర్యానా మీదుగా తుఫాను ఏర్పడనుందని, దీని ప్రభావం సమీప ప్రాంతాలపై ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. ద్రోణి కారణంగా రుతుపవనాలు కూడా వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా వ్యాపించాయని తెలిపింది. శుక్రవారం నుంచి ఈ నెల 15 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో మరో వారం పాటు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం కూడా పలు జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి. రాష్ట్రంలో గత 24 గంటల్లో జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో అత్యధికంగా 3.27 సెం.మీ వర్షపాతం నమోదైంది.

## 'సైబర్' బాధితుల్లో 70% మంది విద్యావంతులే

**ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1,050 కోట్లు ఫ్రీజ్**

- గ్రేట్‌యాప్ సెక్ హ్యాక్‌థాన్‌లో డీజీపీ జితేందర్ వెల్లడి
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోపై ప్రశంసలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నవారిలో విద్యావంతులు, ఉద్యోగస్తులే 70% మేరకు ఉంటున్నారని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన 'గ్రేట్ యాప్ సెక్ హ్యాక్‌థాన్-2024' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టడంతోపాటు బాధితుల సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చురుకుగా వ్యవహరిస్తున్నదని కొనియాడారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.1,050 కోట్ల నగదు సైబర్ నేరగాళ్లకు చేరకుండా ఫ్రీజ్ చేయడంతోపాటు పలు కేసుల్లో రూ.90 కోట్ల వరకు రికవరీ చేసిందని, దాదాపు రూ.85 కోట్ల సొమ్మును బాధితులకు అప్పగించిందని ప్రశంసించారు. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు యువత, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ముందుకు రావాలని డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు.

**టాప్-5 హ్యాకర్స్‌కు సీఎస్‌బీలో అవకాశం**

సైబర్ నేరాలపై యువత తమ కుటుంబసభ్యులు, బంధువులతోపాటు సమాజాన్ని జాగృతం చేయాలని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ కోరారు. 'గ్రేట్ యాప్ సెక్ హ్యాక్‌థాన్-2024'లో 20 దేశాల నుంచి 10 వేల మంది ఔత్సాహికులు పాల్గొంటున్నారని శిఖాగోయెల్ తెలిపారు. రాష్ట్రం నుంచి టాప్-5లో నిలిచిన హ్యాకర్స్‌తోపాటు జాతీయ, అంతర్జాతీయ టాప్-5లో నిలిచిన హ్యాకర్స్‌కు సీఎస్‌బీతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ విభాగం ఐఏఎస్ అధికారి భవేశ్ మిశ్రా, కేంద్ర ప్రభుత్వ అధికారి నరేంద్రనాథ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, డీఎస్‌ఈఐ శ్రీరామ్, సీఎస్‌బీ ఎస్పీ దేవేందర్‌సింగ్, ఏసీపీ కేవీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అమెరికా నుంచి సైబర్ నిపుణుడు మిషెల్ రెడ్‌మెక్, అమీర్ జావేద్ 'జూమ్' ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వేర్వేరు సైబర్ నేరాల కేసుల్లో ఫ్రీజ్ చేసిన సొమ్మును బాధితులకు తిరిగి ఇచ్చేశారు.

## క్రికెటర్ సిరాజ్‌కు ఇంటి స్థలం

- జూబ్లీహిల్స్‌లో 600 గజాలు కేటాయించిన ప్రభుత్వం
- ఖమ్మంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం 52.26 ఎకరాలు



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాదీ క్రికెటర్, టీమిండియా ప్లేయర్ మహ్మద్ సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలం కేటాయించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. భారత ప్లేయర్‌గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఇటీవల ప్రపంచ కప్ గెలిచిన బృందంలో ఉన్న సిరాజ్‌కు ఉచితంగా స్థలాన్ని అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు పలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాలకు స్థలాలను కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం రఘునాథపాలెం, బల్లేపల్లిలో కలిపి 52.26 ఎకరాలను కేటాయించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో శ్రీ స్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాల ఏర్పాటుకు 13.10 ఎకరాలను కేటాయించారు. ఎకరాకు రూ.11.25 లక్షలను మంజూరు చేశారు. గురుకులాలకు భవనాల నిర్మాణం కోసం నిర్మల్ జిల్లా సారంగపూర్‌లో 6 ఎకరాలు, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నాగరాజుపల్లిలో 11 ఎకరాలను కేటాయించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం యాదాద్రి భువనగిరి జిల్లా దండు మల్కాపూర్‌లోని 6.23 ఎకరాల స్థలాన్ని, నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో 6.18 ఎకరాలను టీజీఐఐసీకి అప్పగించారు. ట్రాఫిక్ ట్రెయినింగ్ సెంటర్ నిర్మాణం కోసం కామారెడ్డి జిల్లా క్యాసపల్లిలో 3 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కేంద్ర హోంశాఖకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీస్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 800 చదరపు గజాలు, సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీస్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం కోసం నల్గొండ జిల్లా గొల్లగూడలో 10 గుంటల స్థలాన్ని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏడున్నర గుంటలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు 200కోట్ల బాండ్ల బకాయి

**ఆందోళనలకు సిద్ధమవుతున్న కార్మికలోకం**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : తమకు పాత బకాయిలు చెల్లించకపోవడంపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2013లో బకాయిల్లో 50 శాతం బాండ్ల రూపంలో ఇచ్చిన యాజమాన్యం, వీటిని ఐదేండ్లలో చెల్లిస్తామని హామీ ఇచ్చింది. 2018లోనే చెల్లించాల్సి ఉన్నా కాలయాపన చేసింది. దాదాపు 42 వేల మంది కార్మికులకు బాండ్లకు సంబంధించి వడ్డీ, అసలు కలిపి సుమారు రూ.280 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతో పాటు బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.80 కోట్ల బాండ్ల బకాయిలనే చెల్లించింది. ఇవి కేవలం డ్రైవర్ల క్యాటగిరీకే సరిపోయాయని, వారికి కూడా వడ్డీ చెల్లించలేదని, దీంతో ప్రతి కార్మికుడు రూ.25వేల చొప్పున నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దాదాపు రూ.200 కోట్ల బాండ్ల బకాయిలను ప్రభుత్వం సర్దుబాటు చేయలేదని, ఒక్కో కార్మికుడికి దాదాపు రూ.50 వేల నుంచి రూ.1.50లక్షల వరకు బాండ్ల బకాయిలు రావాల్సి ఉన్నదని చెబుతున్నారు. తక్షణమే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించడంతో పాటు బాండ్ల బకాయిలు చెల్లించాలని లేదంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.





